క్లుప్తంగా

రేపు సమరయోధుల జయంతుల సభ

నెల్లూరు(మినీబైపాస్): జిల్లాకు చెందిన స్వాతంత్య్ర సమరయోధులు, సంఘసంస్కర్తల జయంతుల సభను పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు పద్య కళాపరిషత్ కార్యదర్శి బీ సురేంద్రనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షతన సాయంత్రం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ చంద్రలత, లతీఫ్ కుట్టి పాల్గొని ఉపన్యసిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పెళ్లకూరు జయప్రద, సీత సారంగపాణి, నలబోలు బలరామయ్యనాయుడు, దేవళ్ల పార్థసారథిని సన్మానించనున్నట్లు తెలిపారు.

ఆంజనేయస్వామికి సువర్ణ అలంకరణ



ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. ఆంజనేయస్వామి సువర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌకచర్ల లక్ష్మణరెడ్డి,బుజ్జమ్మ జ్ఞాపకార్థంగా చౌకచర్ల భాస్కరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

దోమల నివారణతో మలేరియాను పారదోలుదాం



కొడవలూరు: దోమలను నివారించడం ద్వారా మలేరియాను పారదోలుదామని యల్లాయపాళెం వైద్యాధికారిని సింధు మేఘన పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మలేరియాపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కారణంగానే మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. రెండ్రోజుల కంటే ఎక్కువ చలి, జ్వరం వస్తుంటే మలేరియాగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియాపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రాణాంతకంగా మారుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాత్రి వేళ దోమతెరలు వాడడం ద్వారా దోమల బారిన పడకుండా చూసుకోవాలని చెప్పారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ నాగరాజు, పీహెచ్ఎన్ విజయ, ఏఎన్ఎం సుకన్య, స్టాఫ్‌నర్స్ స్వర్ణలత, హెచ్ఏలు ప్రసాద్, ఎం సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో పలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టీ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లిషు, హిందీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 12, 13 తేదీల్లో తమ పాఠశాలలో అందజేయాలని సూచించారు. ఇంగ్లిష్‌లో టీజీటీ, పీజీటీ, ఫిజికల్ సైన్స్‌లో పీజీటీ, హిందీలో టీజీటీ, పీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వివాదాలకు దూరంగా ఉండండి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు స్నేహపూర్వకంగా మెలగాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ గిరిబాబు సూచించారు. ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురిని పిలిపించి తగాదాలతో వచ్చే పరిణామాలను శనివారం వివరించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కార్డన్ సెర్చ్ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఔషధాల రేడు.. నేరేడు



రామలింగాపురం సెంటర్‌లో నేరేడు పండ్లను విక్రయిస్తున్న మహిళా వ్యాపారి

నెల్లూరు(బారకాసు): ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేస్తుంది. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అత్యధిక పోషకాలు ఉన్న నేరేడును పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్, తదితరాల రూపంలోనూ తీసుకోవచ్చు. నేరేడు కాయలను వెనిగర్, వైన్ తయారీలోనూ ఉపయోగిస్తారు. నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడంతో ధర కూడా అధికంగానే ఉంటుంది. రైతు దగ్గర దళారులు కేజీ రూ.150కు కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.250కు విక్రయిస్తారు. వినియోగదారుల చేతికొచ్చేసరికి ధర రూ.300 పలుకుతుంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు, రోగకారక సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పండ్లలో ఔషధ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు బీపీ, షుగర్ వంటి జబ్బులను తగ్గించేందుకు దోహదపడుతాయి. అందుకే నేరేడు పండ్లను ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని మద్రాసుబస్టాండ్ సమీపంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద, ట్రంకు రోడ్డు, సుబేదారుపేట, స్టోన్‌హౌస్‌పేట, మినీబైపాస్, తదితర ప్రాంతాల్లో బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.

ప్రయోజనాలు..

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ,సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలోని ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది.
- వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవీ శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

ఆరోగ్యానికి మంచిది...



కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. వర్షాకాలం ప్రారంభానికి ముందు వచ్చే నేరేడు పండ్లను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరుతాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, ప్రభుత్వ విశ్రాంత వైద్యుడు.

గంగమ్మతల్లికి విశేష పూజలు



విశేషాలంకారంలో గంగమ్మతల్లి



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నెల్లూరు సిటీ: మండలంలోని పడారుపల్లిలోని గంగమ్మతల్లి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం విశేష హోమాలు, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గంగమ్మకు కుంకుమార్చన, సుహాసినిపూజ, పల్లకిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మతల్లి సేవకుడు, వీఆర్వో కాకుటూరు శ్రీహరి, మాచవోలు రమేష్‌శర్మ, లీలా వెంకటేశ్వర్లు, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ చెరుకూరు దొరస్వామినాయుడు సహకారంతో మాజీ మేయర్ భానుశ్రీ చేతుల మీదుగా పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి రమేష్ బాబు, కోశాధికారి జయదేవ్, వ్యవస్థాపకులు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర, లోకేష్ , డాక్టర్ అంకిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటరావు, నారాయణరావు, గోపాల్‌రెడ్డి, పొన్నం రవిచంద్ర, సుబ్బరామిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ బాలరామయ్యనాయుడు, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి నగదు సాయం



నెల్లూరు సిటీ: నగర నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త బాబు కుటుంబానికి నగర ఎమ్మెల్యేగా గెలుపొందిన పొంగూరు నారాయణ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల బాబు అనారోగ్యంతో మృతి చెందగా, 3వ డివిజన్ అధ్యక్షుడు గోవర్ధన్, రమణ ఎమ్మెల్యేగా గెలుపొందిన నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన గోమతినగర్‌లోని తన కార్యాలయంలో బాబు భార్య రహమతున్నీసాకు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో అవస్థ



విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది



విద్యుత్ లైన్లపై పడిన ఫ్లెక్సీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్రఅంతరాయాలు కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి నవలాకులతోట విద్యుత్ కేంద్రం నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను అందించే 33కేవీ లైన్లు పలుచోట్ల విద్యుత్‌లైన్లు మరమ్మతులకు గురయ్యాయి. ఫ్లెక్సీలు పడి లైన్లు ట్రిప్‌అవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ కారణంగా శుక్రవారం రాత్రి 10.30 గంటల నుంచి 11 గంటల వరకు, మళ్లీ అర్ధరాత్రి 2.30 గంటల నుంచి 3 గంటల వరకు, తిరిగి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఫ్లెక్సీలను తొలగించి విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పండి

ఆత్మకూరురూరల్: పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిమలూరు ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఇంగ్లిషు మీడియంతో పాటు విద్యాసామగ్రి, ప్రతి రోజూ ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.

పొట్టకూటి కోసం...



కూటి కోసం కోటి విద్యలు అంటారు పెద్దలు. ఇందుకు నిదర్శనంగా నగరంలోని జీవీనగర్ కూడలిలో ఓ కుటుంబం చిన్నారులతో సర్కస్ విన్యాసాలను ప్రదర్శిస్తూ శనివారం కనిపించింది. చిన్నారులు తమ విన్యాసాలతో అటుగా వెళ్లే వారిని ఆకట్టుకున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

పొదలకూరులో భారీ వర్షం



పొదలకూరులో కురుస్తున్న వర్షం

పొదలకూరు : మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని రైతులు ఎడగారు నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురిసి ఇబ్బందులకు గురిచేసింది. భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత రెండురోజులుగా మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో పొదలకూరులో ఓ మోస్తరు వర్షం పడింది. శనివారం భారీ వర్షం పడడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దీంతో ఉక్కపోత, ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. నిమ్మతోటల వర్షం వల్ల ఉపయోగం ఉంటుందని నిమ్మ రైతులు తెలిపారు.

దుర్గమ్మకు పూజలు

ఆత్మకూరురూరల్: రామస్వామిపల్లిలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం కనకదుర్గమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపుగా పెన్నానది వద్దకు తీసుకెళ్లి అభిషేకోత్సవం నిర్వహించారు.

ఘనంగా బాలు జయంతి వేడుకలు



బాలు గీతాలను ఆలపిస్తున్న ఎస్పీ శైలజ



సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు విద్వన్మణి బిరుదుతో సత్కారం

నెల్లూరు(మినీబైపాస్): చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను పురమందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్రాంత తెలుగు అధ్యాపకులు మెట్టు రామచంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు సంగీత విద్వన్మణి బిరుదుతో బాలు పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా బాలు అన్నమయ్య చిత్ర సంకీర్తనలకు నర్తన మయూరి దివ్యపావని ప్రదర్శించిన నృత్యనీరాజనం అలరించింది. బాలు సినీ చిత్ర గీతావళిని నాగార్జున, శైలజ ఆలపించి శ్రోతలను మైమరిపించారు. విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ కవి భువనచంద్ర, సినీగాయని ఎస్పీ శైలజ, సినీ నటుడు శుభలేఖ సుధాకర్, మద్దాళి రఘురాం, వీరిశెట్టి హజరత్‌బాబు, రాజేంద్రకుమార్, కొల్లూరు శ్రీనివాసరావు, విద్యాసాగర్, బలరామయ్యనాయుడు, వెంకటరామయ్య, చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై శేషగిరీశం పాల్గొన్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న లవకుశలు